క్లుప్తంగా

వడ్డె ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేనాని వడ్డె ఓబన్న జయంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చల్లా వెంకటేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన వడ్డె ఓబన్నను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాయకులు శివభాస్కర్, రామకృష్ణ, రాము, రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

16 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో ఈ నెల 16 నుంచి 17వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ యూత్ అమాలీ బాయ్స్ యూనియన్ నాయకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ గ్రామంలో వెలసిన చెన్నకేశవ స్వామికి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రథోత్సవం ఉంటుందని, ఈ సందర్భంగా దాతల సహకారంతో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. గెలుపొందిన జట్లకు వరుసగా..రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గత క్రీడాకారులు ఈ నెల 15వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

శిరివెళ్ల: ఈ నెల 12వ తేదీన బోయలకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు, మండల ప్రభుత్వ డాక్టర్లు బీపీ, షుగర్, కంటి, సాధారణ జబ్బులకు పరీక్షలు చేస్తారని చెప్పారు. గతంలో పరీక్షలు చేయించుకున్నవారు, కొత్త వారు కూడాపరీక్షలు చేయించుకోవచ్చన్నారు. అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. శిబిరంలో వైద్య నిపుణులు చికిత్సలు చేస్తారని స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెంచుల సమస్యల పరిష్కారానికి కృషి

రుద్రవరం: గూడెంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎంపీడీఓ మధుసూధనరెడ్డి తెలిపారు. మండలంలోని హరినగరం గూడెం వాసులతో గురువారం పీఎం జన్ మన్‌కు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఆయన చెంచులతో మాట్లాడి సమస్యలు గుర్తించారు. ఆయా శాఖల వారీగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. సర్పంచు కమలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని వివిధ శాఖల ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దొర్నిపాడు ఎస్‌ఐ బదిలీ



ఎస్‌ఐ తిరుపాల్

దొర్నిపాడు: ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న తిరుపాల్ నందివర్గం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన శుక్రవారం రిలీవ్ కానునట్లు తెలిసింది. అయితే నూతన ఎస్‌ఐగా ఎవరినీ నియమించలేదని సిబ్బంది తెలిపారు.

జోరుగా అభివృద్ధి పనులు



చాగలమర్రిలో కోటగడ్డ వద్ద జరుగుతున్న సీసీ రోడు పనులను పరిశీలిస్తున్న నాయకులు

చాగలమర్రి: మండల కేంద్రంలో సుమారు రూ.1.50 కోట్లు జీజీఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. స్థానిక చిన్నమకానం వీధిలో లాల్‌స్వామి మకానం నుంచి దత్తాత్రేయ ఇంటి వరకు, చింతలచెరువు రస్తాలో మస్తానమ్మ ఇంటి నుంచి రసూల్ ఇంటి వరకు, కూలూరు రస్తాలో రెండు వీదుల్లో 4 సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కోటగడ్డ వీధిలో దస్తగిరి ఇంటి నుంచి దోడియం సుబ్రహ్మణ్యం ఇంటి వరకు, సయ్యద్‌బాషా ఇంటి నుంచి గుర్రం సరోజమ్మ ఇంటి వరకు, 2వ సచివాలయ పరిధిలోని గాడి అక్తరున్ ఇంటి నుంచి సయ్యద్ ఆసిఫ్ ఇంటి వరకు, గుంతపాళెం వీధిలో చిన్న బికారి ఇంటి నుంచి షరీఫ్ ఇంటి వరకు, మహబూబ్ పీరా ఇంటి నుంచి మహమ్మద్‌గౌస్ ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తయ్యాయి. కోటగడ్డ వీధిలో చేపట్టిన పనులను ఎంపీటీసీ సభ్యుడు ముల్లా షేక్షావలి, 4వ సచివాలయ కన్వీనర్ పి.మహబూబ్‌బాషా, వార్డు సభ్యుడు ముల్లా గౌసెపీర్ గురువారం పరిశీలించారు.



దొర్నిపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ



చాగలమర్రిలో కబడ్డీ పోటీల్లో తలపడిన చాగలమర్రి-3, శెట్టివీడు సచివాలయాల జట్లు



రుద్రవరంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం



మహదేవపురంలో క్రీడాకారులకు దస్తులు, కిట్ అందచేస్తున్న సర్పంచు

కొనసాగుతున్న క్రీడా పోటీలు



ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీ ఆడుతున్న దృశ్యం



గోస్పాడులో రైడర్‌ను క్యాచ్ చేస్తున్న సాంబవరం క్రీడాకారులు



ఉయ్యాలవాడలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న పోటీలకు మంచి స్పందన వస్తోంది. గ్రామ స్థాయిలో ప్రతిభ కనబరిచిన యువత మండల స్థాయిలో కూడా ప్రతిభ చూపేందుకు తీవ్రంగా పోటీ పడుతున్నారు. గురువారం స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూరియర్ కళాశాల మైదానంలో పోటీలను కమిషనర్ రమేష్‌బాబు, ఎంపీడీఓ మహబూబ్ ఖాన్, తహసీల్దార్ హరినాథ రావు ప్రారంభించారు.

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం మండల స్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా కొడాపురం, బుర్రారెడ్డిపల్లె యువతులు ఆడారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పీడీలు దేవేంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో రెండవ రోజు గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గ్రామస్థాయిలో గెలుపొందిన వాలీబాల్ జట్లు మండల స్థాయిలో పోటీ పడ్డాయి. ఇంజేడు గ్రామ సచివాలయ పరిధిలోని కాకరవాడ గ్రామానికి చెందిన కట్టుబడి సద్దాం హుసేన్ జట్టు మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో వీరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ప్రకటించారు. టీం సభ్యులను ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్‌బాబు, సురేష్‌బాబు, జయరామిరెడ్డి, విజయదీప్తి, లక్ష్మిసువర్ణ అభినందించారు.

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. గ్రామ స్థాయిలో గెలుసొందిన జట్లు మండల స్థాయిలోనూ ప్రతిభ చాటేందుకు పోటీ పడుతున్నారు. గురువారం పెద్ద కంబలూరు- ఎల్లావత్తుల, మందలూరు- శ్రీరంగాపురం, ముత్తలూరు- రుద్రవరం2, ఆలమూరు- ఆర్.నాగులవరం గ్రామాల జట్లు పోటీ పడ్డాయి.

శిరివెళ్ల: మండలంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో భాగంగా గురువారం మహదేవపురం క్రికెట్ జట్టు సభ్యులకు దుస్తులు, కిట్లను సర్పంచు పెద్ది రమణయ్య అందజేశారు. మహదేవపురం సచివాలయ క్రికెట్ టీం, మహదేవపురం టీం మధ్య జరిగిన పోటీలో మహదేవపురం టీం విజయం సాధించింది. గోవిందపల్లె మైదానంలో శిరివెళ్ల 3వ సచివాలయం జట్టుకు, గోవిందపల్లె 1 సచివాలయం జట్టుకు క్రికెట్ పోటీలు జరగగా గోవిందపల్లె జట్టు విజయవం సాధించింది. అలాగే శిరివెళ్ల1 , శిరివెళ్ల 4వ సచివాలయం జట్ల మధ్య పోటీలో శిరివెళ్ల- 4 జట్టు విజయం సాధించింది. యర్రగుంట్ల మైదానంలో జీనేపల్లె సచివాలయం, యర్రగుంట్ల సచివాలయం జట్ల మధ్య పోటీ జరగగా యర్రగుంట్ల జట్టు విజయం సాధించింది.

చాగలమర్రి: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో గురువారం కొనసాగాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 2వ రోజు మొత్తం 9 మ్యాచ్‌లు నిర్వహించారు. క్రికెట్‌లో 3 మ్యాచ్‌లు నిర్వహించగా చాగలమర్రి-3, 4, చిన్నవంగలి గ్రామ సచివాలయాలకు చెందిన జట్లు విజయం సాధించాయి. బ్యాడ్మింటన్‌లో ముత్యాలపాడు-1, పెద్దవంగలి జట్లు, కబడ్డీలో మద్దూరు, శెట్టివీడు జట్లు విజయం సాధించాయి. వాలీబాల్‌లో చాగలమర్రి-2,3 జట్లు విజయం సాధించినట్లు పీడీ ముల్లా దాదాపీర్ తెలిపారు. పీఈటీలు శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, భారతీ, సుమన్, కామేంటేటర్ రవి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గోస్పాడు: మండల కేంద్రంలో గురువారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా 12 సచివాలయ పరిధిలోని గ్రామస్థాయి పోటీల్లో విజేతలైన కబడ్డీ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో సాంబవరం, జూలేపల్లె టీంల మధ్య పోటీ జరగగ్గా సాంబవరం 23పాయింట్లు, జూలేపల్లె 13పాయింట్లు సాధించాయి. దీంతో విన్నర్‌గా సాంబవరం జట్టు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సాల్మాన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగఅనసూయ, ఎంఈఓలు అబ్దుల్‌కరీం, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

నంద్యాల మండలంలో హోరాహోరీగా..



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(అర్బన్): చాపిరేవుల గ్రామంలో గురువారం జరిగిన కబడ్డీ పోటీలను ఎంపీడీఓ సుగుణశ్రీ, కోచ్ పిచ్చిరెడ్డి ప్రారంభించారు. భీమవరం-రాయమాల్పురం జట్లు తలపడగా రాయమాల్పురం జట్టు విజయం సాధించింది. కొత్తపల్లె-పాండురంగాపురం జట్లలో పాండురంగాపురం, బిల్లలాపురం-పుసులూరు జట్లలో బిల్లలాపురం, కానాల 2-పులిమద్ది జట్లలో కానాల 2 జట్టు, కొత్తపల్లె 1-చాపిరేవుల జట్లలో కొత్తపల్లె 1, పెద్దకొట్టాల, రాయమాల్పురం లలో పెద్దకొట్టాల, మిట్నాల-చాబోలు గ్రామాల మధ్య జరిగిన పోటీల్లో చాబోలు జట్టు విజయం సాధించింది. పోలూరు-కానాల 1కు జరిగిన సెమీ ఫైనల్‌లో పోలూరు జట్టు విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్రికెట్ పోటీల్లో చాపిరేవుల-అయ్యలూరు 2 జట్లలో అయ్యలూరు 2 విజయం సాధించగా మిటాన్ల-కానాల 1 మధ్య పోటీల్లో మిట్నాల, అయ్యలూరు 1-చాపిరేవుల జట్ల మధ్య జరిగిన పోటీల్లో అయ్యలూరు 1 విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

నంద్యాల(అర్బన్): అంబేడ్కర్ నిర్దేశించిన మార్గంలో అందరూ నడవాలని జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు సన్నల సాయిరాంరెడ్డి కోరారు. గోపాల్‌నగర్‌లో అంబేడ్కర్ సామాజిక సమత సంకల్పం సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన ప్రారంభించనున్నారని చెప్పారు.

ముగ్గుల పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం ముగ్గుల పోటీలను పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రారంభించారు. విజేతలైన ఉపాధ్యాయినులకు బహుమతులను కరస్పాండెంట్ పద్మావతిరెడ్డి అందజేశారు.

సంస్కృతిని చాటేలా సంక్రాంతి సంబరాలు



బహుమతులు అందజేస్తున్న శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): తెలుగువారి సంస్కృతిని చాటేలా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని శిల్పా సహకార్ మహిళా బ్యాంక్ చైర్‌పర్సన్ శిల్పా నాగినిరెడ్డి కోరారు. గురువారం సంక్రాంతి పండుగ, మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మహిళలకు స్థానిక ప్రథమనంది దేవస్థానం ఆవరణలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు సంక్రాంతి పండుగను విశిష్టతను చాటుతూ వివిధ రంగవల్లులను వేశారు. మొదటి బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేలు, 25మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, దృశ్య కళల డైరెక్టర్ సునిత అమృతరాజ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ సేవకుల సమావేశం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీభద్రావతి భావనారుషి దేవస్థానంలో శ్రీరామ సేవకుల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన జరగబోయే అయోధ్య బల బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని ప్రతి దేవాలయంలో, ఇళ్లలో సాయంత్రం ఐదు ప్రమిదలను వెలిగించి మహామంగళ హారతులు ఇచ్చి పండుగ వాతావరణాన్ని నెలకొల్పాలని పిలుపునిచ్చారు. భజరంగదళ్ రాష్ట్ర కార్యదర్శి పోలేపల్లి సందీప్, కమ్మయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపుతున్నాం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(సిటీ): పట్టణంలో అభివృద్ధి చేసి చూపుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వన్‌టౌన్‌లో షాలిమార్ మసీద్ దగ్గర రూ.26 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లను ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నంద్యాల పట్టణ రూపురేఖలు మార్చామని, గత పాలకులు విస్మరించిన అభివృద్ధిని నేడు చేసి చూపిస్తుంటే ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఓల్డ్ టౌన్‌లో ఇప్పటికే రూ.2కోట్ల పైగా అభివృద్ధి పనులు చేశామని చెప్పుకోవడానికి గర్విస్తున్నామన్నారు. మరో రూ.40లక్షలకు సంబంధించిన అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేశామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టిశ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు సాదిక్‌బాషా, కలాం బాషా, ఆరిఫ్‌నాయక్, తబ్రీజ్, కోఆప్షన్ సభ్యులు సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్లు మునయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల రారాజు జగనన్న





సాంబవరంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, పీపీ నాగిరెడ్డి, నంద్యాల పట్టణంలో..

గోస్పాడు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేసి పేదలను అందుకుంటున్న మనసున్న మారాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిన కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తో ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు మంచి వేదిక అన్నారు. టీడీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్ర ప్రజలకు మంచి చేయలేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే నవరత్నాలను ప్రజలకు అందజేసి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ ఐజయ్య, ఎంపీటీసీ భారతి, నాయకులు బోరెడ్డి గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శీను, రాజన్న, జమాలయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

సాంబవరం గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.28.50 లక్షలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను వారు గురువారం ప్రారంభించారు. రూ.12లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, రూ.16.50లక్షలతో దర్గా ప్రహరీ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు.

నంద్యాల(సిటీ): అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది.. పింఛను ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా.. ఆరోగ్యం ఎలా ఉంది అంటూ ప్రజలను పలకరిస్తూ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి గురువారం 28వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్, వైస్ చైర్మన్ పాంషావలితో కలిసి నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మబున్నిసా, నాయకులు చాణిక్య రాజు, మాణిక్య రాజు, ప్రభుదాసు, రవికుమార్, మహేష్, నరసింహులు, రామాంజనేయులు, రవికుమార్, వంశీ ,కౌన్సిలర్లు కలాం బాషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్య రంగంలో విస్తరిస్తున్న ఆళ్లగడ్డ

- కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా స్థానిక వైద్యశాలలు
- ఆధునిక వైద్యం అందుబాటులో
- మెరుగైన వైద్య సదుపాయాలు



ఆళ్లగడ్డ పట్టణం

ఆళ్లగడ్డ: ఒకప్పుడు చిన్నచిన్న ప్రైవేటు వైద్యశాలకే పరిమితమైన ఆళ్లగడ్డ పట్టణం నేడు కార్పొరేట్ వైద్యశాలకు ధీటుగా ప్రభుత్వ వైద్యశాలలను ఏర్పాటు చేస్తూ వైద్యరంగంలో కొత్త పుంతలను తొక్కించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. నంద్యాల పట్టణానికి దగ్గరలో ఉండటంతో ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలు ఏ చిన్న జబ్బుచేసినా స్పెషలిస్ట్ డాక్టర్‌ను సంప్రదించాలంటే పెద్ద పట్టణాలకు వెళ్లేవారు. దీనికి తోడు ఏదైనా ప్రమాదంలో గాడపడితే ప్రత్యేక అంబులెన్స్‌లు, కార్లలో ఎన్నో వ్యయప్రయాసాలతో నంద్యాల, కర్నూలు, హైదరాబాద్ తదితర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే కొంతకాలంగా ఆళ్లగడ్డ పట్టణం ఇటీవల కాలంలో వైద్య రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ఒక్కో వ్యాధికి ఒక్కో స్పెషలిస్ట్ రావడంతో పాటు అధునాతన ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చాయి. దీనికి తోడు పట్టణంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం 50 పడకల వైద్యశాలగా మార్చడంతో అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రావడంతో వైద్య సదుపాయాలు మెరుగయ్యాయి. ప్రధానంగా వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందించేందుకు అవసరమైన సాంకేతిక అందుబాటులోకి వచ్చింది. ఆయుర్వేద పంచకర్మ వైద్యం కూడా అందుబాటులో ఉండటంతో నియోజకవర్గం ప్రజలకు భరోసా లభించినట్లయ్యింది.